క్లుప్తంగా

ఫిట్ ఇండియా ఫ్రీడం రన్



పెనమలూరు: ఫిట్ ఇండియా స్వచ్ఛత ఫ్రీడమ్ రన్ 4.0 కానూరులో శనివారం నిర్వహించారు. కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కాలేజీ నుంచి కానూరు 100 అడుగుల రోడ్డు వరకు 200 మంది విద్యార్థులు రన్‌లో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ ఫిట్‌నెస్‌పై ప్రజల్లో అవగాహన కల్పించటానికి ఫిట్ ఇండియా మిషన్ ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. వ్యాయామం ఆరోగ్యానికి చాలా అవసరమని తెలిపారు.

మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎస్టీ కాలనీకి చెందిన మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ నేతృత్వంలో వీటిని మహిళలకు అందజేశారు. ట్రస్ట్ సభ్యులు జాస్తి ఫణికుమార్, చిమట శ్రీనివాసరావు, మీడియా కో ఆర్డినేటర్ జాస్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక

ఉయ్యూరు: పెనమలూరు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక స్థానిక ఏజీఅండ్ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల మైదానంలో శనివారం నిర్వహించారు. క్రీడాకారుల ఎంపిక పోటీలను గుడివాడ డీవైఈఓ పద్మారాణి ప్రారంభించారు. 200 మంది క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి, నియోజకవర్గ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జీవీ రమణ, పీఈటీలు మల్లయ్య, మురళి, అథ్లెటిక్స్‌కోచ్ వరలక్ష్మి, కంకిపాడు మండల స్పోర్ట్స్ ఇన్‌చార్జి హరిగోపాల్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డీడీగా అజంతకుమార్

మధురానగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.అజంతకుమార్‌కు డెప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో ఆయన డెప్యూటీ డైరెక్టర్‌గా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఓపెన్ యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు అజంతకుమార్‌ను అభినందించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు కృషి

కంకిపాడు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనకు ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండలంలోని కోలవెన్ను ఎంపీపీ పాఠశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. సర్పంచ్ సీహెచ్ సురేష్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. స్థానికంగా అందుతున్న వైద్య సేవలను జెడ్పీటీసీ బాకీ బాబు, ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. డాక్టర్ సుధా ప్రసూజ, డాక్టర్ నిఖిత, డాక్టర్ కౌసల్య, ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ వైద్య సేవలు అందించారు. 545 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. కంటి వెలుగు ద్వారా వైద్య పరీక్షలు చేయించుకున్న రోగులకు కళ్లజోళ్లు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, డీఎల్‌డీఓ నాంచారరావు, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీఓ పి.అనూష, ఎంఈఓ పి.ప్రసాద్, ఎంపీటీసీ తోకల ఉమాదేవి, ఉప సర్పంచ్ కంచర్ల వెంకటరావు, మాజీ సర్పంచ్ టెక్కెం సతీష్‌కుమార్, నాయకులు కొప్పరాజు సురేష్, కొలుసు లక్ష్మణ్, కంచర్ల శేషగిరి, ఈఓ సువర్ణలక్ష్మి, వీఆర్ఓ సందీప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉయ్యూరు: మండలంలోని కడవకొల్లు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆర్డీఓ ఎన్.విజయ్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి జె.జ్యోతి శిబిరాన్ని సందర్శించి సేవలపై ఆరా తీశారు. రోగులకు మందులు అందజేశారు. శిబిరాన్ని తొలుత సర్పంచ్ మంగినేని సుధారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విమాదేవి, తహసీల్దార్ మస్తాన్ వాని, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తమ శర్మ, సర్పంచ్ మూల్పూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



కోలవెన్నులో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాకీ బాబు, తదితరులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రతి ఒక్కరికీ మెరుగైన నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ×జగనన్న ఆరోగ్య సురక్ష₹ కార్యక్రమాన్ని చేపట్టారని ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ అన్నారు. బాపులపాడు మండలం ఆరుగొలనులో శనివారం ×జగనన్న ఆరోగ్య సురక్ష₹ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బాపులపాడు, వీరవల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంజే మంజూష, కిరణ్మయి నేతృత్వంలోని వైద్యుల బృందం గ్రామస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరంలో 584 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గన్నవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పసుపులేటి మురళీ, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తమ శర్మ, సర్పంచ్ మూల్పూరి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గన్నవరం రూరల్ : ప్రతి ఒక్కరికీ నాణ్యమైన కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి చెప్పారు. శనివారం మండలంలోని చిన అవుటపల్లి ఎంపీపీ పాఠశాల ఆవరణలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని చెప్పారు. నవరత్నాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి, ఎంపీడీవో ఈ.సత్యకుమార్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, పెద అవుటపల్లి పీహెచ్‌సీ వైద్య బృందం పాల్గొన్నారు.



కడవకొల్లులో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ విజయ్‌కుమార్ తదితరులు



ఆరుగొలనులో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



చినఅవుటపల్లి వైద్య సేవలను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పేదలకు మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ రాజ్యలక్ష్మి

పెనమలూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ రాజ్యలక్ష్మి అన్నారు. గోసాల–1 సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పీడీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్య సేవలు అందించి సంపూర్ణ ఆరోగ్యంగా ప్రజలు ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మండల ప్రత్యేకాధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ పెనమలూరు మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో మంచి స్పందన కనబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా 265 మందికి ఉచిత వైద్య సేవలు అందించారు. కంటి వెలుగు వైద్య పరీక్షల్లో కూడా ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ నాంచారావు, ఎంపీడీఓ సునీతాశర్మ, తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరు: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమాన్ని చేపట్టిందని మండల ప్రత్యేకాధికారి ఫణి దూర్జటి అన్నారు. వేంపాడు మండల పరిషత్ పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వ్యాధులను సర్వే ద్వారా తెలుసుకుని వారికి వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. 504 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బి.శిరీష, మల్లిఖార్జునరావు, వి.లావణ్య, అఖీల్ తేజ, ప్రసన్నరాణి, చాగంటిపాడు, వేంపాడు సర్పంచులు లక్ష్మి అనూష, శివనాగబాబు, ఎంపీటీసీ నటరాజ్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



వేంపాడులో మందుల కిట్లు అందజేస్తున్న వైద్య సిబ్బంది

పారిశుద్ధ్యాన్ని మెరుగు పర్చండి

పంచాయతీ అధికారులకు డీపీఓ జయచంద్ర ఆదేశం

రామవరప్పాడు : పారిశుద్ధ్యం మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని డీపీఓ జయచంద్ర పంచాయతీ అధికారులను ఆదేశించారు. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో శనివారం డీపీఓ జయచంద్ర, డీఎల్‌పీఓ శ్రీనివాసరావు పర్యటించి పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య పెరుగుతుండటంతో పారిశుద్ధ్య నిర్వహణ, ఇతరత్రా అంశాలను పరిశీలించారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో చెత్త గుట్టలను చూశారు. వెంటనే చెత్తను తొలగించాల్సిందిగా ఆదేశించారు. గ్రామంలో సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పారిశుద్ధ్య సిబ్బందితో వాటర్ ట్యాంక్ సమీపంలో చెత్తను పూర్తిగా తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామని అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.



ప్రసాదంపాడులో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న అధికారులు

టిప్పర్ ఢీ కొనడంతో వ్యక్తికి గాయలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): టిప్పర్ ఢీ కొనడంతో జాతీయ రహదారి దాటుతున్న ఓ వ్యక్తి గాయాలపాలైన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నక్క గోపయ్య కృష్ణలంకలోని రణదీవెనగర్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో కూలీ పనికి వెళ్లే క్రమంలో అమెరికన్ హాస్పిటల్ సమీపంలో జాతీయ రహదారి దాటుతున్నాడు. ఆ సమయంలో బస్టాండ్ వైపు నుంచి వారధి వైపు అతివేగంగా వెళ్తున్న టిప్పర్ అతడిని ఢీకొట్టింది. గాయపడిన అతడిని సమీపంలోని వారు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.
శనివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉద్యోగావకాశాలపై అవగాహన



గన్నవరం: ఉన్నత ఉద్యోగాలు కోసం విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ డిపార్ట్‌మెంట్ హెడ్ తిరుపతిరెడ్డి సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శనివారం డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన తరగతి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం సాంకేతిక రంగంలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని చెప్పారు. అందుకు తగ్గట్లుగా విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావు, కంప్యూటర్ విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పెనమలూరు: వెలుగులో పని చేస్తున్న వీఓఏల సమస్యలను పరిష్కరించాలని మండల వీఓఏ సంఘం కోరింది. ఈ మేరకు పెనమలూరు వెలుగు కార్యాలయం వద్ద ఏపీఎం గోవిందరాజుకు శనివారం వినతిపత్రం అందజేశారు. వీఓఏ సంఘ సభ్యులు వివరాలు మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, హెచ్ఆర్ పాలసి అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని, 15 సంఘాలలోపు ఉన్న వీఓఏలకు వేతనం ఇవ్వాలని, వీఓఏల మెర్జ్ ఆపాలని కోరారు. వీఓఏల కార్యదర్శి సునీత, సభ్యులు ఎస్‌కె.సాంబ, నిర్మల, బాలమ్మ, రజిని, సీఐటీయూ నేత ఉప్పాడ త్రిమూర్తి పాల్గొన్నారు.

చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు పరిశీలన

నున్న (విజయవాడరూరల్): నున్న గ్రామంలో తాగునీటి చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మించనున్నారు. ఈ మేరకు శనివారం అధికారులు చెరువులను పరిశీలించారు. ఇటీవల స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమానికి నున్న గ్రామం విచ్చేసిన పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ చెరువులను చూసి వాతావరణం ఆహ్లాదకరంగా ఉందని ప్రజలు వాకింగ్ చేసుకొనే విధంగా ట్రాక్ నిర్మించనున్నట్లు ప్రకటించారు. అందులో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుకవైపు ఉన్న రెండు చెరువుల మధ్యలో చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మించడానికి అధికారులు చెరువులను పరిశీలించారు. కట్టపై మూడు మీటర్ల వెడల్పు, 600 మీటర్లు పొడవు ఉండేలా గ్రావెల్ పోసి కట్టకు రెండు వైపులా గోడలు నిర్మించి సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి సుమారు రూ.8 లక్షల వరకు అంచనా రూపొందించాల్సి ఉందన్నారు. చెరువులను పరిశీలించిన వారిలో డ్వామా ప్రాజెక్టు అధికారి జె.సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ జేఎల్‌వీ ప్రసాద్, డీఈ దయానంద్, ఏఈ శ్వేత, నున్న గ్రామ ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ ఉన్నారు.



చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. వణుకూరు గ్రామానికి చెందిన కొడాలి రాజేష్ కాంట్రాక్టు పనులు చేస్తాడు. అతను తన బైక్‌పై ఇంటికి వెళుతుండగా గంగూరు పవర్ స్టేషన్ వద్ద వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు రాజేష్ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో రాజేష్ రోడ్డుపై పడిపోవటంతో గాయాలు అయ్యాయి. బాధితుడు విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వ్యాపారం నిమిత్తం వేరు ఊరు వెళ్లిన తన భర్త కనిపించడం లేదంటూ వివాహిత కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన బొప్పల వీరమ్మ, జాన్సన్ భార్యభర్తలు. జాన్సన్ ఇతర ప్రాంతాలకు బైక్‌పై వెళ్లి ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తుంటాడు. ఈ నెల 3వ తేదీన వ్యాపారం నిమిత్తం ఊరు వెళ్లిన జాన్సన్ ఫోన్ స్విచ్‌ఆఫ్ అని వస్తుంది. దీంతో ఆందోళన చెందిన వీరమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

అభ్యసన సామర్థ్యం మెరుగుపడేలా!

- నవంబరు 3న జాతీయ స్థాయిలో నాస్ పరీక్షకు సన్నాహాలు
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో పాఠశాలల ఎంపిక
- 3, 6, 9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య పరీక్ష
- సన్నద్ధమవుతున్న విద్యాశాఖ

కంకిపాడు: విద్యార్థుల అభ్యసన సామర్థ్యం మెరుగుపడేలా విద్యావ్యవస్థలో సమూల మార్పులకు ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. నిపుణులైన ఉపాధ్యాయులతో పాఠ్యాంశాలను సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తోంది. అభ్యసన సామర్థ్యం, స్థాయి మెరుగునకు ఉపాధ్యాయులకు సైతం అవసరమైన శిక్షణ ఇచ్చి బోధనా పద్ధతుల్లో వినూత్న మార్పులు తెచ్చింది. విద్యారంగానికి ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఈ క్రమంలో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం ఏ మేరకు మెరుగుపడిందో తెలుసుకునేందుకు జాతీయ స్థాయిలో నవంబరు 3న కేంద్ర ప్రభుత్వ అసెస్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్), రాష్ట్ర ప్రభుత్వ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్ఈఏఎస్) పరీక్ష నిర్వహించేందుకు విద్యాశాఖ సన్నద్ధమైంది. ఎంపిక చేసిన పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు.

ఉమ్మడి కృష్ణాజిల్లాలో...

దేశ వ్యాప్తంగా నవంబరు 3వ తేదీన ఈ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ దఫా 3, 6, 9 తరగతులు చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందుకు గానూ ఉమ్మడి కృష్ణా జిల్లాలో 1810 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను ఎంపిక చేశారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా ఓఎంఆర్ విధానంలోనే పరీక్ష జరగనుంది. మండలాల వారీగా పాఠశాలల ఎంపిక, హాజరుకానున్న విద్యార్థుల సంఖ్య వివరాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. కృష్ణా జిల్లా వ్యాప్తంగా 3, 6, 9 తరగతులకు సంబంధించి 24,168 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో ఆంగ్ల మాధ్యమం 20587 మంది, తెలుగు 3395 మంది, ఉర్దూ 186 మంది ఉన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు సంబంధించి 22405 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా ఆంగ్ల మాధ్యమం విద్యార్థులు 19942 మంది, తెలుగు 2385, ఉర్దూ 78 మంది విద్యార్థులు ఉన్నారు.



ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు

పకడ్బందీగా నిర్వహణకు...

జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలూ విద్యాశాఖ చేపట్టింది. ఇన్విజిలేటర్లుగా ఉపాధ్యాయులే ఉంటే సమర్థంగా పరీక్ష సాగదనే ఉద్దేశ్యంతో డైట్, డిగ్రీ, పీజీ విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించనున్నారు. ఇందుకు గానూ కృష్ణా జిల్లాలో 1087 మందిని, ఎన్టీఆర్ జిల్లాలో 908 మందిని ఎంపిక చేశారు. పరీక్షను పర్యవేక్షించేందుకు బ్లాక్ కోఆర్డినేటర్లుగా ఎంఈఓలకు బాధ్యతలు అప్పగించారు. కృష్ణా జిల్లాలో 47 మందిని, ఎన్టీఆర్‌లో 42 మందిని ఎంపిక చేశారు. పరీక్ష నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై మాసాంతంలో శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ సన్నద్ధమవుతోంది.

సామర్థ్యాల మదింపు...

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. పాఠశాలల రూపురేఖలను నాడు-నేడు ద్వారా పూర్తిగా మార్చివేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఆసక్తి పెరిగేలా పాఠశాల వాతావరణంలో మార్పులు తెచ్చింది. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించేలా ఉపాధ్యాయులకు పలు దఫాలు శిక్షణ అందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు చేరువ చేస్తూ ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలను అందుబాటులోకి తెచ్చింది. దృశ్య, శ్రవణ బోధనతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెంపుదలకు మార్గం సుగమం అయింది. అంతేకాకుండా గుణాత్మక విద్యా కార్యక్రమాలను అమలు చేస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన, అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు ప్రభుత్వం, విద్యాశాఖ సమష్టిగా అడుగులు వేశాయి. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసి, రానున్న రోజుల్లో విద్యా వ్యవస్థ, బోధనా పద్ధతుల్లో తీసుకోవాల్సిన మార్పులకు 'నాస్' జాతీయ పరీక్ష ఒక చక్కటి వేదిక కానుంది.

బోధనలో వినూత్న మార్పులు



విద్యాబోధన, అభ్యసన విషయాల్లో అనేక మార్పులు, చేర్పులు జరిగాయి. విద్యార్థుల స్థాయి పెంపొందేలా బోధనలో వినూత్న పద్ధతులు, సాంకేతికత చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం విద్యార్థుల అభ్యసన సామర్థ్యం ఎలా ఉంది అని తెలుసుకోవటానికి జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ పరీక్ష మంచి అవకాశం. వీటి ఫలితాల ఆధారంగా రానున్న రోజుల్లో చేపట్టాల్సిన విద్యా విషయక చర్యలు, మార్పులపై స్పష్టత వస్తుంది. విద్యాభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది. విద్యార్థులు పరీక్షను సద్వినియోగం చేసుకుని ప్రతిభ చాటాలి.

– తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా జిల్లా

వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు: గుణదల నుంచి వీటీపీఎస్‌కు వెళ్లే 220 కేవీ విద్యుత్ లైన్ల ఆధునికీకరణలో భాగంగా ఈనెల ఆదివారం నుంచి 10వ తేదీ వరకూ వ్యవసాయ విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఏర్పడుతుందని ఉయ్యూరు డివిజన్ ఈఈ కృష్ణనాయక్ తెలిపారు. ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో రైతులు సహకరించాలని కోరారు.

మహిళామార్ట్ ఏర్పాటుకు చర్యలు

నున్న (విజయవాడరూరల్): నున్న గ్రామంలో జగనన్న చేయూత మహిళామార్ట్ ను ఏర్పాటు చేయనున్నట్లు డీఆర్‌డీఏ ఏపీఎం గంధం చంద్రశేఖర్ తెలిపారు. మహిళామార్ట్ ఏర్పాటుకు వసరమైన భవనం కోసం శనివారం నున్న గ్రామం వచ్చిన ఆయన ఈ విషయం తెలియజేశారు. మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యుల షేర్‌ధనం పెట్టుబడిగా మహిళామార్ట్‌ను ఏర్పాటు చేసుకొనే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. మండలంలో సుమారు 2200 గ్రూపుల నుంచి దాదాపు రూ.23 లక్షలను షేర్ ధనంగా పెట్టుబడికి సిద్ధం చేసినట్లు వివరించారు. మహిళామార్ట్ ఏర్పాటు వలన మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వీలుంటుందన్నారు. గ్రామాల్లో మహిళలు తయారు చేసే ఉత్పత్తులు అనగా పచ్చళ్లు, కారం పొడులు, ఇతర ఉప్పత్తులను మహిళామార్ట్ ద్వారా కొనుగోలు చేసి వాటిని విక్రయించుకోవచ్చన్నారు. కొంత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

శాంతియుత సమాజ స్థాపనే లక్ష్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమాజంలో శాంతి స్థాపన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.రామచంద్రారెడ్డి చెప్పారు. స్థానిక ఏలూరురోడ్డులోని గణపతి కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన మానవత ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. హనుమాన్‌జంక్షన్ శాఖ రాష్ట్రంలోనే అత్యధికంగా సభ్యత్వ నమోదు సాధించటం అభినందనీయమని ప్రశంసించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు మానవత వ్యాప్తి చెందిందని, ఇప్పటికి 105 శాఖలకు విస్తరించిందని చెప్పారు.
మంచి వ్యక్తులందరిని ఓ సమూహంగా ఏర్పరచి, తద్వారా సమాజంలో మార్పు సాధించేందుకు కృషి చేయటమే మానవత లక్ష్యమని రామచంద్రారెడ్డి తెలిపారు. సభ్యత్వ నమోదు, సేవా కార్యక్రమాల నిర్వహణలో మానవత ఎంతో ఆదర్శంగా నిలిచిందన్నారు. మానవత జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి వడ్డి రాజేశ్వరరావు, సీనియర్ సభ్యులు డాక్టర్ నిడమర్తి లలితా కామేశ్వరి, గంటా సత్యనారాయణ, ఇందిరా దేవి, నారగాని కొండలరావు, జన్యావుల సత్యనారాయణ, కన్నికంటి సుబ్బారావు, కల్లేపల్లి నారాయణరావు, అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.